క్లుప్తంగా

నెలలో నాలుగుసార్లు చెత్త వాహనాల శుభ్రం



చెత్త వాహనాలు శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నరసాపురం: వినూత్న కార్యక్రమాలతో పట్టణాభివృద్ధికి, మున్సిపల్‌పాలానా వ్యవహారాలు గాడిలో పెట్టడానికి ప్రయత్నిస్తూ పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్న నరసాపురం మున్సిపల్ కొత్త కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మరో కార్యక్రమాన్ని ఆరంభించారు. నెలలో 4 సార్లు విధిగా మున్సిపల్ చెత్త వాహనాలను శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశారు ఇచ్చారు. ప్రతీనెలా 16,17,29,30 తేదీల్లో కచ్చితంగా వాహనాలు శుభ్రం చేమాలని ఆదేశించారు. దీంతో మంగళవారం చెత్త ఎత్తే వాహనాలను శుభ్రం చేశారు. నెలలో ఒకరోజు కూడళ్లలోని జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని గత నెలలో కమిషనర్ జలాభిషేకం పేరుతో ప్రారంభించిన విషయం తెలిసిందే.

రజకపేటలో అన్నసమారాధన



రజకపేటలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెనుమంట్ర: స్థానిక రజకపేటలో వేంచేసియున్న శ్రీ భక్తాంజనేయ స్వామి వారికి హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజక సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులంతా స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణను విద్యుత్ దీపాలతో అలంకరించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

మార్టేరులో ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ



శ్రీ వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో బాస్కెట్‌బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెనుమంట్ర: మార్టేరు శ్రీ వేణుగోపాల ఉన్నతపాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఈ నెల 31 వరకూ యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూత్ బాస్కెట్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు యూత్ బాస్కెట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు కర్రి క్రుష్ణారెడ్డి తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రమశిక్షణతో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతీ రోజు పాఠశాల ఆవరణలో విద్యార్థులకు బాస్కెట్‌బాల్ ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆయన అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చి బలమైన పౌష్టికాహారాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక మెనూ తయారు చేసి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో మంగళవారం రూ.14లక్షల 40 వేలతో నిర్మించిన అంగన్‌వాడీ ప్రీస్కూల్ భవనాన్ని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పాలు, గ్రుడ్లు, చిక్కీలు, రాగిజావ, ఎండు ఖర్జూరం, బాలామృతం తదితర పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామన్నారు. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలు చాలీచాలని అద్దె భవనాల్లో తమ ప్రభుత్వంలో సొంతభవనాల్లో సౌలభ్యంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధులు వరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కష్టం రాకుండా అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకు మాదిరిగా, పిల్లలకు మేనమామగా బాధ్యత తీసుకుని పని చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర చరిత్రలోనే తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కాలేదని గుర్తు చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రాష్ట్రంలో స్వర్ణయుగాన్ని తలపించేలా పాలన చేశారని ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి మరో రెండడుగులు ముందుకు వేసి స్వర్ణపాలన సాగిస్తున్నారన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా భగ్గేశ్వరం

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



భగ్గేశ్వరంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన భగ్గేశ్వరం గ్రామంలో మున్సిపల్ సాధారణ నిధులతో అన్ని మౌలికవసతులు కల్పిస్తామని శాసనమండలి సభ్యులు కవురు శ్రీనివాస్ హామీనిచ్చారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన భగ్గేశ్వరంలో పర్యటించి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వాల హయాంలో ఎవరూ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి పేద, మధ్య తరగతి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. భగ్గేశ్వరంలో అధికంగా ఉన్న చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం పథకం ద్వారా ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సహాయం అందజేశారన్నారు. గ్రామంలో బోరు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో ప్రజలందరికీ మంచినీరు అందిస్తామని శ్రీనివాస్ చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మైలాబత్తుల మైకేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్సి వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ భగ్గేశ్వరం గ్రామ కమిటీ అధ్యక్షుడు సిద్ధాని మహేష్‌కుమార్, వార్డు కమిటీ నాయకులు పెచ్చెట్టి కోటేశ్వరరావు, సిద్ధాని శివకోటయ్య, జోగి శ్రీనివాస్, అందే మార్కండేయులు, అందే అంకయ్య, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, రేలంగి శ్రీనివాస్, బండి రమేష్, మోర్త గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం ఇలా

భగ్గేశ్వరం గ్రామంలో బుధవారం ఉదయం 7 గంటలకు రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మైలాబత్తుల మైకేల్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గ్రంథాలయాల్లో యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: సమ్మర్ క్యాంపులో భాగంగా గ్రంథాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో యోగా, సూర్య నమస్కారాలు, శ్వాసమీద ధ్యాస, గరుడాసనం, మత్స్యాసనం, ఉష్ట్రాసనంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు క్యారమ్స్, చెస్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు కథలు, నీతి వ్యాఖ్యాలు చెప్పి నూతన విద్యార్థులను పరిచయం చేశారు. గ్రంథాలయాధికారిని వి శాంతకుమారి, కె.వి.వి సత్యనారాయణ, వి వెంకట్రావు, కె. సూర్యకుమార్ పాల్గొన్నారు.

కొడమంచిలి అభివృద్ధికి తోడ్పాటు



తూర్పుపాలెంలో క్రైస్తవ మహాసభల ఆహ్వాన పత్రికలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: కొడమంచిలి అభివృద్ధికి ఎనలేని సహకారాన్ని అందిస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. కొడమంచిలి చినపేటలో పరిశుద్ధ క్రీస్తు లూథరన్ దేవాలయం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించబోయే క్రైస్తవ మహాసభల కరపత్రాలను తూర్పుపాలెంలో మంగళవారం విడుదల చేశారు. కొడమంచిలి చినపేటలో రూ.50 లక్షలతో డ్రయినేజీ నిర్మాణం చేసినట్లు సంఘ పెద్దలకు వివరించారు. సీసీ రోడ్డులు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పంచాయతీ సభ్యులు పుచ్చకాయల నాగార్జున, సంఘ సభ్యులు ఉటాల శ్రీను, కప్పల చంద్రశేఖర్, సల్లాబత్తుల కాంతారావు, కొంబోత్తుల రత్నరాజు, కత్తుల రవి, పాట్ల గంగాదర్, చికిలే జయరాజు, పుచ్చకాయల రాజులు పాల్గొన్నారు.

యువతకు అండగా సీఎం జగన్

రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను పెంపుదలకు కృషి చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు అండగా నిలుస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో వ్యవసాయానికి ఉపయోగపడే దిద్దే సుకుమార్‌కు చెందిన ట్రాక్టరు ప్రారంభించారు. కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, పెనుమంట్ర ఎంపీపీ కర్రి వాసురెడ్డి, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, పార్టీ నాయకులు రుద్రరాజు శివాజీ రాజు, మేడిచర్ల పండు, కొవ్వూరి చిన్నలు పాల్గొన్నారు.



సిద్ధాంతంలో కల్వర్టు నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

కల్వర్టు పనులు పూర్తి చేయాలి

సిద్ధాంతంలో కల్వర్టు పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశించారు. మంగళవారం తూర్పుపాలెంలో అధికారుల తో కల్వర్టు నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. కల్వర్టు నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయిన్‌తో ప్రతీ ఏటా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అక్కడ వారందరూ గడపగడపకు మన ప్రభుత్వంలో తమ దృష్టికి తీసుకువచ్చారన్నా రు. దీంతో ప్రక్షాళన పనులు ప్రారంభించామన్నారు. కొంత మేర పూర్తయ్యాయని, త్వరలోనే పూర్తి స్థాయిలో పూర్తి చేస్తాన్నారు. దీంతో పాటు కల్వర్టు నిర్మాణం వలన ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమీక్షలో ఏఈలు ఎస్ శ్రీనివాస్, ఈశ్వరిలు పాల్గొన్నారు.

ముగిసిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ బాబ్జి

పాలకొల్లు సెంట్రల్: వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు విద్యార్థుల్లో క్రమ శిక్షణతో పాటు విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంపొందుతుందని డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జీ) తెలిపారు. స్థానిక బివిఆర్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లీష్ వేసవి శిక్షణా తరగతులు మంగళవారం ముగించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ వసుధా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిషు శిక్షణా తరగతుల్లో మంచి నైపుణ్యం సాధించిన కె.జాహ్నవికి మరియు మరికొంత మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీవీఆర్ఎం గరల్స్ హైస్కూల్ విద్యార్థినులు ఆర్.నేహా తరంగిణి, బాలి దీక్షిత, కోరుకొండ సుబ్రియ, కంచర్ల ఏసమ్మలకు డాక్టర్ బాబ్జీ బహుమతులు అందజేశారు. వేదాంతం సుందరి, సురేఖ, పిఎల్ ప్రసాద్, వసుధా ఫౌండేషన్ కన్వీనర్ ఉద్దరాజు పెద్దిరాజులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ప్రభాకరశాస్త్రి, ఉపాధ్యాయులు బ్రహ్మాజి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



యడ్లబజారు సెంటర్‌లో మానవహారం చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పరిశరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం వీవర్స్ కాలనీ అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో జాతీయ డెంగీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పులి (ఏడీస్) దోమ వల్ల డెంగీ వ్యాధి సోకుతుందన్నారు. ఈ దోమను అరికట్టాలంటే ఇంటి పరిసరాల్లో గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. గుంటల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమ పెరిగి వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వార్డులో పర్యటించి ప్రజలకు డెంగీ వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలు గురించి వివరించారు. అనంతరం స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఆరోగ్య సిబ్బంది మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జాన్ లియో, డాక్టర్ చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల దెబ్బకు బెంబేలు



పెనుగొండలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

పెనుగొండ: భానుడు భగభగలతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. మంగళవారం ఆచంట నియోజకవర్గంలో సూర్యుడు ప్రతాపాన్ని చూపాడు. 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో ఉదయం 11 గంటల నుంచే రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం ఆరు గంటల నుంచి ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నం 5 గంటల వరకూ ప్రతాపం చూపుతూనే ఉంది. వేడిగాలులు తీవ్రత అధికంగా ఉండడంతో వ్యవసాయ పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడంది. 11 గంటలు దాటిన తరువాత పనులకు రాలేమంటూ వ్యవసాయ కార్మికులు చేతులెత్తేయడంతో రైతులు వారి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. రోహిణీ రాకుండానే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో రాబోయే రోజుల్లో మరింత తీవ్రత ఉంటుందని ఆందోళనకు గురవుతున్నారు. ఎండ తీవ్రతతో ఉదయమే త్వరగా పనులు ముగించుకొని, 11 గంటలకే ఇళ్లకు చేరుకుంటున్నారు. ఎండ త్రీవతతో ఇబ్బందులు పడకుండా దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి సేవా సమితి, మానవత, క్రిస్టియన్ సేవా సంస్థలు, పలు వ్యాపారస్థులు చలివేంద్రాలు ఏర్పటు చేశారు. వీరితో పాటు. పెనుగొండ కెనాల్ రోడ్డులో ఎంపీటీసీ సభ్యుడు తాడి సుబ్బిరెడ్డి చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగతో దాహార్తిని తీరుస్తున్నారు. వ్యాపారస్తులు 12 గంటలకే దుకాణాలు మూసివేసి సాయంత్రం తిరిగి తెరుస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మరో 10 నుంచి 15 రోజులు జాగ్రత్తగా ఉండాలంటూ వైద్యాధికారులు పేర్కొంటున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుని వడగాల్పులకు గురికావద్దంటూ హెచ్చరించారు.

నేడు మత్స్యకార భరోసా ప్రారంభం

నరసాపురం: నియోజకవర్గానికి సంబంధించి బుధవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో జరిగే మత్స్యకార భరోసా పథకాన్ని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రారంభిస్తారు. ఈ మేరకు ఆయన కార్యాలయ వర్గాలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశాయి. అలాగే చీఫ్‌విప్ ముదునూరి ఉదయం 10 గంటల నుంచి పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. మత్స్యకార భరోసా ప్రారంభ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మత్స్యకారులు పాల్గొనాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో 36 నామినేషన్ల దాఖలు

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభించిన రెండవరోజు మంగళవారం నామినేషన్లు దాఖలు సమయం ముగిసే నాటికి 36 నమినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్ చెప్పారు. బుధవారం నామినేషన్ల పరిశీలన ఉంటుందని చెప్పారు. ఈనెల 26న పోలింగ్, కౌంటింగ్ ఉంటుంది.

ప్రాంగణ ఎంపికలో 45 మందికి అర్హత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బీఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 45 మంది అర్హత సాధించారు. మంగళవారం కళాశాల ఆవరణలో దివీస్ లాబొరేటరీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 63 మంది విద్యార్థులు పాల్గొనగా 45 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దిరిశాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఎంపికలో 16 మంది ఛాంబర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను దివీస్ లాబలేటరీస్ హెచ్.ఆర్ సిహెచ్ పూర్ణ ప్రసాద్, ఏ రాజేష్, కళాశాల చైర్మన్ కేవీ ఆర్ నరసింహరావు, సెక్రటరీ కె. రామరాజు, ప్లేస్మెంట్ ఆఫీసర్ కె. లక్ష్మణరావులు అభినందించారు.

పెనుమంట్రలో వైభవంగా రథోత్సవం



పెనుమంట్రలో శ్రీ దాసాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: ప్రతీ విద్యార్థి చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుమంట్ర పంచాయతీ చెరువు ఒడ్డున ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు, శ్రీ పుంతలోముసలమ్మవారి 14వ వార్షిక తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం గ్రామంలో జరిగిన శోభాయాత్ర , రథోత్సవ కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా పల్లపువీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దాసాంజనేయస్వామిని. శ్రీ పుంతలో ముసలమ్మవారిని దర్శించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీ దాసాంజనేయ స్వామిని రథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రామాయణ అంతర్గత అంశాలపై 15 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి బహుమతిగా బంగారు హనుమాన్ ప్రతిమను గెలుచుకున్న పిల్లా సాయిరోహిత్ (13) అనే విద్యార్థికి స్వామివారి ప్రతిమను రంగరాజు చేతులమీదుగా అందజేశారు. ముందుగా రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి రథం లాగారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, శ్రీ కనకదుర్గమ్మ వారి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తమనంపూడి సాయినారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లిమిల్లి గోపిరెడ్డి పల్లపువీధి యూత్‌లైన్స్ సభ్యులు కొవ్వూరి నాగరాజమోహన్‌రెడ్డి, కర్రి నారాయణరెడ్డి, కర్రి నాగిరెడ్డి, టి.హరిప్రసాద్‌రెడ్డి, టి.సుబ్రహ్మణ్యంరెడ్డి, అర్చకులు సీతారామశాస్త్రి, చిట్టా రవి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

యలమంచిలి: మండలంలోని గుంపర్రు గ్రామంలో పంట పొలాల వద్ద పేకాడుతున్న ముగ్గురుని మంగళవారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5450 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఆయన వివరించారు.

శృంగవృక్షంలో...

పాలకోడేరు: మండలంలోని శృంగవృక్షం శివారులో పేకాట స్థావరంపై పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు సోమవారం రాత్రి సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రమాదం

తణుకు: ఎండల వేడితోపాటు విద్యుత్ ఓవర్ లోడ్ కారణంగా తణుకు డీ1 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక వీమాక్స్ థియేటర్ సమీపంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పొటెన్షియల్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఎండల వేడి కారణంగా ఆయిల్ మరిగిపోయి ఈ ప్రమాదం జరిగిందని ఏడీఈ రామకృష్ణ తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా అత్తిలి, ఇరగవరం మండలాల పరిధిలోని కొద్ది సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పటికీ అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్తూరు: మొగల్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో ఖాళీగాఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు అర్హులైనవారు ఈనెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టుఅధికారి బి.ఊర్మిళ మంగళవారం ఓప్రకటనలో కోరారు. నరసా పురం మండలం కొప్పర్రు పంచాయతీలోని పీతలగరువు అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్సీ అంగన్‌వాడీ కార్యకర్త, అదే మండలంలలోని రాజుల్లంక పంచాయతీ పెదలంక అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు(ఓపెన్ పీహెచ్), సరిపల్లి పంచాయతీలోని సరిపల్లి గరువు అంగన్‌వాడీకేంద్రంలో అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్సీ) మొగల్తూరుమండలంలోని కొత్తోట పంచాయతీలోని కాకాని చెరువు అంగన్‌వాడీ కేంద్రంలోని అంగన్‌వాడీ సహాయకురాలు (ఓపెన్) పోస్టులు ఖాళీగాఉన్నాయని స్థానికులై ఉండి, పదో తరగతి ఉత్తీర్ణులైనవారు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులను నింపి మొగల్తూరు లోని తమ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని ఆమె కోరారు.

పోడూరులో..

పోడూరు: పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న 4 అంగన్‌వాడీ ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి మండలంలోని పెదలంక(ఎస్‌సీ), పాలకొల్లు మండలంలోని యాళ్లవానిగరువు(బీసీ-సీ), పాలకొల్లు రూరల్ నాగరాజుపేట(బీసీ-ఎ), వరిధన ం శివారు పడమటిపాలెం(బీసీ-బి) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హతలు కలిగిఉన్న అభ్యర్థులు ఈ నెల 23న సాయంత్రం 5గంటల లోపు పోడూరులో ఉన్న పాలకొల్లు ఐసీడీఎస్ కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులు, విద్యార్హతలు , ఇతర ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సీడీపీఓ ఇందిర ప్రకటనలో తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ. 1.71 లక్షల అందజేత



రెడ్‌క్రాస్ సొసైటీకి రూ. 1.71 లక్షల చెక్‌ను కలెక్టర్ ప్రశాంతికి అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఇండియన్ రెడ్‌క్రాస్‌లో శాశ్వత సభ్యత్వం కలిగి ఉంటే వారి అవసరాల మేరకు రక్తం ఉచితంగా అందిస్తారని జిల్లా కలెక్టరు పి ప్రశాంతి అన్నారు. మంగళవారం భీమవరం పట్టణంలోనిబీవీ రాజు కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యలమంచిలి మండలం గ్రామ సచివాలయాలు, పంచాయతీ ఉద్యోగులు రెడ్‌క్రాస్ సొసైటీకి సుమారు రూ. 1.71 లక్షల చెక్‌ను ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి కలెక్టరుకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో రెడ్ క్రాస్ సంస్థకు విరాళాలు అందజేసి రాష్ట్రంలో మనకు బహుమతి వచ్చే విధంగా సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ , డీపీఓ జీవీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ యాగానికి రూ.5 లక్షల విరాళం



మంత్రి కొట్టు సత్యనారాయణకు విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో గత నాలుగు రోజుల నుండి నిర్వహిస్తున్న అష్టోత్తర శతగుండాత్మక చండీ రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత మహాలక్ష్మి యాగ మహోత్సవానికి భీమవరానికి చెందిన ఆనంద గ్రూప్స్ అధినేత ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు రూ.5 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మేరకు చెక్కు మంగళవారం యాగశాల వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రివర్యులు కొట్టు సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కంతేటి వెంకటరాజు పాల్గొన్నారు.

అభయాంజనేయుని సేవలో పీవీఎల్

కాళ్ల: మాలవానితిప్ప గ్రామంలో కొలువుతీరి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి వారిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు దర్శించుకున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా కాళ్ల మండలం మలవానితిప్ప గ్రామంలోని ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీవీఎల్ నరసింహరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కర్త, గ్రామ సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు, ఎమ్మెస్ ఎస్ రాజు పాల్గొన్నారు.